నల్గొండ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఉత్తమంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

4

Neti Velugu

నేటి వెలుగు

నేటి సమాజం... నేటి వెలుగు...

RNI NO. TELTEL/2023/88559

తెలుగు దినపత్రిక

www.epaper.netivelugu.com

netivelugu63@gmail.com



నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 221 | పేజీలు : 4 | నవంబర్ 27 శుక్రవారం 2026 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 221 | PAGES:4 | FRIDAY NOVEMBER 27 2026 | Rs. 4:00

మేము పాలకులం కాదు.. ప్రజా సేవకులం: రేవంత్ రెడ్డి

హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సంవిధాన్ రక్షా మార్చ్

ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి నెక్లెస్ రోడ్డు వరకు భారీ ర్యాలీ

రాజ్యాంగంపై కుట్ర జరుగుతోందన్న సీఎం రేవంత్‌రెడ్డి

రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కలిసిరావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో 'సంవిధాన్ రక్షా మార్చ్' పేరిట భారీ ర్యాలీ నిర్వహించారు. ట్యాంక్‌బండ్‌పై ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ ప్రదర్శన, నెక్లెస్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహం వరకు సాగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా



ఈ మార్చ్‌కు నాయకత్వం వహించారు.ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో రాజ్యాంగంపై కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు.

(మిగతా 2వ పేజీలో..)

రాజ్యాంగ సూత్రాలు పార్లమెంటుకే పరిమితం కాకూడదు: మోదీ

ప్రభుత్వ పథకాలు రాజ్యాంగ ఆశయాలకు అనుగుణంగా ఉన్నాయని వెల్లడి

గత ప్రభుత్వాలు ఆర్టికల్ 356ను వందసార్లు దుర్వినియోగం చేశాయని విమర్శ

భారత్ ఫస్ట్, కర్తవ్యం అనే సూత్రాలతో ముందుకు సాగాలని పిలుపు

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రధాని ప్రత్యేక వ్యాసం

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలు దినపత్రికల్లో "రాజ్యాంగాన్ని బలోపేతం చేసేందుకు ఒక నిబద్ధత" పేరిట ప్రత్యేక వ్యాసం రాశారు. రాజ్యాంగ సూత్రాలు కేవలం పార్లమెంటు, న్యాయస్థానాలకే పరిమితం కాకుండా, ప్రతి పౌరుడి దైనందిన జీవితంలో అంతర్భాగం కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాజ్యాంగ నిర్మాతలు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌లకు ఘన



పోక్సో కేసులో బండి భగీరథ్‌కు మేడ్చల్ కోర్టు సమన్లు

పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు మేడ్చల్ జిల్లా ప్రత్యేక పోక్సో న్యాయస్థానం సమన్లు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి జరుగుతున్న విచారణలో భాగంగా అయన స్వయంగా కోర్టుకు హాజరు కావాలని స్పష్టం చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. జనవరి 28న న్యాయస్థానం ఎదుట హాజరు కావాలని ఆదేశించడంతో ఈ కేసు ట్రయల్ ప్రక్రియలో




కీలక ముందడుగు పడింది.17 ఏళ్ల మైనర్ బాలికను వేధించడంతో పాటు బలవంతంగా మద్యం తాగించి, శారీరకంగా ఇబ్బందులకు గురిచేశారని

(మిగతా 2వ పేజీలో..)

తెలంగాణలో తగ్గనున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు.. 2 నుంచి 4 డిగ్రీల మేర పడిపోయే అవకాశం

తెలంగాణలో మళ్లీ పొడి వాతావరణం ఏర్పడుతున్న నేపథ్యంలో రానున్న ఐదు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం (ఐఎండీ) వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత పెరిగే అవకాశం ఉందని తెలిపింది.గత కొన్ని రోజులుగా కురుస్తున్న తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మేఘావృతం కారణంగా రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యాయి. అయితే, డిసెంబర్ 3 వరకు పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ కేంద్రం తన ఏడు

(మిగతా 2వ పేజీలో..)



ప్రభుత్వ బడిలో సైన్స్ ఫేర్ జరిపే స్తోమత లేదా: హరీశ్ రావు

సిద్దిపేట జిల్లా సైన్స్ ఫేర్‌ను ప్రైవేట్ స్కూల్లో పెట్టడంపై హరీశ్ రావు అసహనం

గత ప్రభుత్వ హయాంలో సిద్దిపేటకు జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయని వెల్లడి

సిద్దిపేట విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయాలని డిమాండ్

సిద్దిపేట జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఫేర్) నిర్వహణ వేదిక ఎంపికపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించాల్సిన జిల్లా స్థాయి సైన్స్ ఫేర్ కార్యక్రమాన్ని ఒక ప్రైవేట్ విద్యాసంస్థలో ఏర్పాటు చేయడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం తెలిపారు.కనీసం ప్రభుత్వ పాఠశాలలో జరిపే సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలలో జరిపే స్తోమత



కూడా ప్రభుత్వానికి లేదా? అని హరీశ్ రావు

(మిగతా 2వ పేజీలో..)

వచ్చే ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఓడిపోవడం ఖాయం: ఈటల రాజేందర్

వచ్చే ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి 100 శాతం ఓడిపోతారన్న ఈటల రాజేందర్

కాంగ్రెస్‌కు 90 శాతం సీట్లు వస్తాయనడం కేవలం భ్రమేనని వ్యాఖ్య

గత కేసీఆర్ ప్రభుత్వ అవినీతిపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్న

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భ్రమల్లో బతుకుతున్నారని, రాబోయే ఎన్నికల్లో ఆయన వంద శాతం ఓడిపోవడం

(మిగతా 2వ పేజీలో..)



హైదరాబాద్ మరో బెంగళూరు కాకూడదు: డీజీపీ సీవీ ఆనంద్

ఐటీ కంపెనీల పనివేళలను మార్చాలని సూచించిన సీవీ ఆనంద్

కేబీఆర్ పార్క్ తరహాలో వన్-వే లూప్‌లు, ఫ్రీ లెఫ్ట్‌లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదన

హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌లో తీవ్ర ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఐటీ కంపెనీల పనివేళలు మార్చాల్సిన అవసరం ఉందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. 'సైబరాబాద్ మూవ్స్ ఇన్ 2026' సదస్సులో ఆయన మాట్లాడుతూ ఐటీ కారిడార్

(మిగతా 2వ పేజీలో..)



అధికారుల నిర్లక్ష్యం వల్లే పల్నాడు ప్రాజెక్టు పనులు ముందుకు సాగాయి: కోమటిరెడ్డి

పల్నాడు ప్రాజెక్టు పనులను ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకుంటామన్న కోమటిరెడ్డి

నీళ్ల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ

పల్నాడు ప్రాజెక్టు విషయంలో కేంద్రం పునరాలోచించాలని విన్నపం

పల్నాడు ప్రాజెక్టు ద్వారా నీటి తరలింపును ఎట్టిపరిస్థితుల్లోనూ అడ్డుకుంటామని తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందే నీళ్లు, నిధులు, నియామకాల కోసమని... కాబట్టి నీటి హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదని అన్నారు.ప్రాజెక్టు ఎప్పుడు మొదలైందన్నది ప్రస్తుతం ప్రధానం కాదని, తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు దానిని అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని కోమటిరెడ్డి పేర్కొన్నారు.



పల్నాడు ప్రాజెక్టు పనుల పురోగతికి సంబంధించి ప్రభుత్వానికి సమయానికి సమాచారం ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం వహించారని, వారి అలసత్వం వల్లే ప్రాజెక్టు పనులు ముందుకు

(మిగతా 2వ పేజీలో..)

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

సంపాదకీయం

చేతిలో సెల్‌ఫోన్.. కనుమరుగవుతున్న పుస్తకం!

సమాచార విప్లవంలో తగ్గుతున్న పఠనాసక్తి.. మళ్లీ పుస్తకాల వైపు అడుగులు పడాలి

పుస్తకం మనిషికి మంచి స్నేహితుడు. అది కేవలం అక్షరాల సమాహారం కాదు.. ఆలోచనలకు దారి చూపే సాధనం, జ్ఞానాన్ని పెంచే నిధి, జీవితాన్ని అర్థం చేసుకునే మార్గదర్శి. ఒకప్పుడు ఉదయం పత్రిక చదవడంతో మొదలయ్యే రోజు, సాయంత్రం పుస్తక పఠనంతో ముగిసేది. గ్రంథాలయాలు విద్యార్థులతో కళకళలాడేవి. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. చేతిలో సెల్‌ఫోన్, కళ్ల ముందు తెర, నిమిషానికో కొత్త సమాచారం.. ఇదే నేటి జీవనశైలిగా మారింది. సాంకేతికత అందించిన సౌకర్యాల మధ్య పుస్తక పఠనానికి కేటాయించే సమయం క్రమంగా తగ్గిపోతోంది.

సమాచారం ఎక్కువ.. అవగాహన తక్కువ!

సామాజిక మాధ్యమాల్లో ప్రతి నిమిషం వందలాది విషయాలు మన ముందుకు వస్తున్నాయి. చిన్న వీడియోలు, ఆకర్షణీయమైన శీర్షికలు, తక్షణ సందేశాలు సమాచారాన్ని వేగంగా అందిస్తున్నాయి. అయితే సమాచారం తెలుసుకోవడం వేరు.. దానిని లోతుగా అర్థం చేసుకోవడం వేరు. ఒక అంశంపై పూర్తి అవగాహన రావాలంటే చదవడం, విశ్లేషించడం, ప్రశ్నించడం అవసరం. పుస్తక పఠనం ఈ లక్షణాలను పెంపొందిస్తుంది. కానీ తక్కువ సమయంలో ఎక్కువ విషయాలు తెలుసుకోవాలనే తొందరలో లోతైన అధ్యయనం పట్ల ఆసక్తి తగ్గుతోంది. ఫలితంగా ఏ అంశంపైనా ఎక్కువసేపు దృష్టి కేంద్రీకరించలేని పరిస్థితి ఏర్పడుతోంది.

విద్యార్థుల్లో చదివే అలవాటు పెరగాలి

విద్యార్థుల అభివృద్ధి కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకూడదు. చరిత్ర, విజ్ఞానశాస్త్రం, సాహిత్యం, జీవిత చరిత్రలు, సమకాలీన అంశాలకు సంబంధించిన పుస్తకాలను చదవడం వల్ల వారి పరిజ్ఞానం విస్తరిస్తుంది. పదజాలం పెరుగుతుంది. భాషపై పట్టు సాధ్యమవుతుంది. స్వతంత్రంగా ఆలోచించే శక్తి పెరుగుతుంది. పరీక్షల్లో మార్కులు సాధించడమే విద్య లక్ష్యంగా మారితే సృజనాత్మకతకు అవకాశం తగ్గుతుంది. విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయాన్ని పఠనానికి కేటాయించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.

గ్రంథాలయాలు మళ్లీ కళకళలాడాలి

ఒకప్పుడు గ్రామాల్లో, పట్టణాల్లో గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా ఉండేవి. పత్రికలు, వారపత్రికలు, నవలలు, పోటీ పరీక్షల పుస్తకాలతో అవి పాఠకులకు ఎంతో ఉపయోగపడేవి. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో గ్రంథాలయాలు సరైన వసతులు లేక, పాఠకుల ఆదరణ తగ్గి నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. కొన్ని చోట్ల పుస్తకాలు ఉన్నా చదివేవారు లేరు. మరికొన్ని చోట్ల పుస్తకాలు, సిబ్బంది, మౌలిక సదుపాయాల కొరత ఉంది. ప్రభుత్వాలు గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి. కొత్త పుస్తకాలు, డిజిటల్ వనరులు అందుబాటులో ఉంచాలి. పాఠశాలలు, కళాశాలల్లో పఠన కార్యక్రమాలను ప్రోత్సహించాలి.

మాతృభాషలో పఠనానికి ప్రాధాన్యం

తెలుగు భాషలో అపారమైన సాహిత్య సంపద ఉంది. కథలు, నవలలు, కవిత్వం, చరిత్ర, జీవిత చరిత్రలు ఎన్నో తరాలకు జ్ఞానాన్ని అందించాయి. మాతృభాషలో చదవడం వల్ల భావాలను సులభంగా అర్థం చేసుకోవచ్చు. పిల్లలకు చిన్నప్పటి నుంచే తెలుగు కథల పుస్తకాలను పరిచయం చేయాలి. ఇంట్లో పుస్తకాలు చదివే వాతావరణం ఉండాలి. తల్లిదండ్రులు పిల్లలకు కథలు చెప్పడం, వారితో కలిసి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి. భాషపై ప్రేమ పెరిగితే సాహిత్యంపై ఆసక్తి కూడా సహజంగా పెరుగుతుంది.

పుస్తక పఠనం.. మానసిక వికాసానికి తోడు

పుస్తకం చదివేటప్పుడు మనిషి ఒక విషయంపై ఏకాగ్రతతో దృష్టి పెడతాడు. పాత్రల అనుభవాలను అర్థం చేసుకుంటాడు. విభిన్న ఆలోచనా విధానాలను తెలుసుకుంటాడు. ఇతరుల భావాలను గౌరవించే గుణం పెంపొందించుకుంటాడు. ముఖ్యంగా జీవిత చరిత్రలు కష్టాలను ఎదుర్కొన్న వ్యక్తుల ప్రయాణాన్ని పరిచయం చేస్తాయి. విజ్ఞాన పుస్తకాలు కొత్త ఆవిష్కరణలపై ఆసక్తిని కలిగిస్తాయి. సాహిత్యం మానవ సంబంధాలను, సమాజంలోని సమస్యలను అర్థం చేసుకునే దృష్టిని ఇస్తుంది. అందుకే పఠనం వ్యక్తిగత వికాసంతో పాటు సమాజ వికాసానికీ దోహదపడుతుంది.

పుస్తకాన్ని మళ్లీ స్నేహితుడిని చేసుకుందాం

సాంకేతికతను వదిలేయాల్సిన అవసరం లేదు. మొబైల్ ఫోన్లలోనూ ఈ-పుస్తకాలు, డిజిటల్ గ్రంథాలయాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని కూడా ఉపయోగించుకోవచ్చు. అయితే నిరంతరం సామాజిక మాధ్యమాల్లో సమయాన్ని వృథా చేయకుండా రోజుకు కనీసం అరగంటైనా పఠనానికి కేటాయించాలి. పాఠశాలల్లో పుస్తక పఠన పోటీలు నిర్వహించాలి. ప్రతి గ్రామంలో గ్రంథాలయాలు అందుబాటులో ఉండేలా చూడాలి. పుస్తక ప్రదర్శనలు, రచయితలతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించి యువతలో ఆసక్తి పెంచాలి. సెల్‌ఫోన్ మనకు ప్రపంచాన్ని చూపించగలదు. కానీ ఆ ప్రపంచాన్ని లోతుగా అర్థం చేసుకునే ఆలోచనా శక్తిని పుస్తకం పెంపొందిస్తుంది. వేగంగా మారుతున్న కాలంలో సమాచారాన్ని పొందడం మాత్రమే కాదు.. దాన్ని విశ్లేషించి సరైన నిర్ణయాలు తీసుకోవడం కూడా అవసరం. అందుకు పఠనమే బలమైన పునాది. పుస్తకాలు మూలనపడితే జ్ఞానానికి తలుపులు మూసుకున్నట్లే. అందుకే ప్రతి ఇంట్లో పుస్తకానికి స్థానం కల్పించాలి. ప్రతి విద్యార్థి చేతిలో పుస్తకం ఉండాలి. పఠన సంస్కృతిని తిరిగి బలోపేతం చేసినప్పుడే విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

పోక్సో కేసులో బండి భగీరథ్‌కు మేడ్చల్ కోర్టు సమన్లు

మొదటి పేజీ తరువాయి)

బాధితురాలి తల్లి చేసిన ఫిర్యాదు ఆధారంగా మే నెలలో పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ క్రమంలో పోలీసులు మే 16న బండి భగీరథ్‌ను అరెస్ట్ చేశారు. ఆయనపై పోక్సో చట్టంలోని నిబంధనలతో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఆధారాలను ధ్వంసం చేయడం తదితర సంబంధిత సెక్షన్ల కింద అభియోగాలు నమోదు చేశారు.దాదాపు 50 రోజులకు పైగా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న బండి భగీరథ్‌కు, జూలై నెలలో కోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. ప్రస్తుతం ఈ కేసు విచారణ మేడ్చల్ పోక్సో కోర్టులో నడుస్తుండటంతో, తదుపరి న్యాయ ప్రక్రియ కోసం ఆయన వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావడం తప్పనిసరిగా మారింది. జనవరి 28న జరిగే విచారణలో కేసు తదుపరి దశకు చేరుకోనుంది.

మేము పాలకులం కాదు.. ప్రజా సేవకులం: రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి)

మోదీ ముఠా నుంచి రాజ్యాంగాన్ని రక్షించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పని చేస్తోందని స్పష్టం చేశారు. తాము పాలకులం కాదని, ప్రజాసేవకులమని అన్నారు. నియంతల వంటి పాలకులు ఉండాలో లేక ప్రజల కోసం పోరాడేవారు ఉండాలో ప్రజలే నిర్ణయించుకోవాలని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుకోవడానికి రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమంలో ప్రజలంతా స్వచ్ఛందంగా కలిసిరావాలని కోరారు.ఈ భారీ ర్యాలీలో ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ బీఎం సందీప్ కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలతో పాటు పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజ్యాంగ విలువల పరిరక్షణే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

రాజ్యాంగ సూత్రాలు పార్లమెంటుకే పరిమితం కాకూడదు: మోదీ

మొదటి పేజీ తరువాయి)

నివాళులర్పించిన ప్రధాని.. సామాన్య కుటుంబంలో జన్మించిన వ్యక్తి దేశ ప్రధాని స్థాయికి చేరుకోగలగడం మన రాజ్యాంగ వైశిష్ట్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.సామాజిక, ఆర్థిక న్యాయం చేకూర్చాలన్న రాజ్యాంగ స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం పీఎం ఆవాస్ యోజన, ఉజ్వల, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలను అమలు చేస్తోందని మోదీ తెలిపారు. జీఎస్టీ (101వ సవరణ), జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా (102వ సవరణ), ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు (103వ సవరణ) వంటివి తమ ప్రభుత్వ హయాంలో చేపట్టిన కీలక రాజ్యాంగ సవరణలని ఆయన వివరించారు.గత ప్రభుత్వాల వైఖరిపై ప్రధాని తన వ్యాసంలో విమర్శలు సంధించారు. ఒక రాజకీయ పార్టీ గతంలో సుమారు వందసార్లు ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేసి రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసిందని ఆరోపించారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దును చారిత్రక తప్పిదాన్ని సరిదిద్దడంగా ఆయన అభివర్ణించారు. ప్రధాన ప్రతిపక్షం 'విరోధ్ పక్ష్' (ప్రతిపక్షం)గా కాకుండా 'అవరోధ్ పక్ష్' (అడ్డంకులు సృష్టించే పక్షం)గా మారిందని ప్రధాని ఎద్దేవా చేశారు. 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు "భారత్ ఫస్ట్ అనే ఆలోచన, కర్తవ్యం అనే ఆచరణ" అనే రెండు సూత్రాలు మనకు మార్గదర్శకాలు కావాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

ప్రభుత్వ బడిలో సైన్స్ ఫేర్ జరిపే స్తోమత లేదా: హరీశ్ రావు

మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో సైన్స్ ఫేర్ లో సిద్దిపేటకు జాతీయ స్థాయి అవార్డులు తెచ్చుకున్నామని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రదర్శనల పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆయన విమర్శించారు.సిద్దిపేటపై వివక్షతోనే ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. సైన్స్ ఫేర్ అంశంతో పాటు విద్యార్థుల సంక్షేమ పథకాల అమలులోనూ అలసత్వం కనిపిస్తోందన్నారు. విద్యార్థులకు అందించాల్సిన బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని సిద్దిపేటలో ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రస్తుత విద్యా సంవత్సరం సగం పూర్తవుతున్నప్పటికీ విద్యార్థులకు కేవలం ఒక్క జత యూనిఫాం మాత్రమే ఇచ్చారని గుర్తుచేశారు. విద్యార్థులకు వెంటనే మిగిలిన యూనిఫాంలను పంపిణీ చేయాలని, బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని వెంటనే పూర్తిస్థాయిలో ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

వచ్చే ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఓడిపోవడం ఖాయం: ఈటల రాజేందర్

మొదటి పేజీ తరువాయి)

ఖాయమని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. ఈరోజు కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో పర్యటించిన ఆయన పలు స్థానిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై తీవ్ర విమర్శలు చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి రాబోయే ఎన్నికల్లో 90 శాతం సీట్లు వస్తాయని సీఎం రేవంత్‌రెడ్డి భ్రమపడుతున్నారని ఈటల ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించారని ఆయన ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాబోయే 10 నుంచి 15 ఏళ్ల దాకా కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని ఆ పార్టీ కార్యకర్తలే స్వయంగా చెప్పుకుంటున్నారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఈటల ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకుందో సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రజల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

హైదరాబాద్ మరో బెంగళూరు కాకూడదు: డీజీపీ సీవీ ఆనంద్

మొదటి పేజీ తరువాయి)

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి పలు కీలక సూచనలు చేశారు.అన్ని కంపెనీలకు ఒకే సమయంలో పనివేళలు ఉండటం వల్లే సైబరాబాద్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ పరిధిలో ట్రాఫిక్ ఒత్తిడి తీవ్రంగా ఉంటోందని డీజీపీ తెలిపారు. సైబరాబాద్‌లో వీధుల అనుసంధానం సరిగ్గా లేదని, వర్షం పడితే వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్‌లోనే చిక్కుకుపోతున్నారని ఆయన వివరించారు. ఇప్పటి నుంచే తగిన చర్యలు చేపట్టకపోతే హైదరాబాద్ కూడా బెంగళూరు తరహా ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉద్యోగులు సొంత వాహనాల కంటే ప్రజా రవాణాను ఎక్కువగా వినియోగించుకోవాలని కోరారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం జూబ్లీహిల్స్, కేబీఆర్ పార్క్ తరహాలో వన్-వే లూప్‌లు, ఫ్రీ లెఫ్ట్‌లు, యూ-టర్న్‌లు తీసుకురావాలని డీజీపీ ప్రతిపాదించారు. ఐటీ ఉద్యోగుల ప్రయాణాల కోసం ప్రత్యేక క్యారేజ్ వే, కౌంటర్-ఫ్లో బస్ లేన్లను పరిశీలించవచ్చని పేర్కొన్నారు. మియాపూర్ వంటి ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ వేగవంతం చేయాలని, కంపెనీల భాగస్వామ్యంతో ఫ్లైఓవర్లు నిర్మించాలని సూచించారు. కొత్త ట్రాఫిక్ నిబంధనలు అమలు చేసినప్పుడు తొలి 2-3 రోజులు ప్రజల నుంచి వచ్చే విమర్శలకు పోలీసులు భయపడకుండా, సమస్య పరిష్కారం కోసం ధైర్యంగా ముందుకు సాగాలని ఆయన స్పష్టం చేశారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే పల్నాడు ప్రాజెక్టు పనులు ముందుకు సాగాయి: కోమటిరెడ్డి

మొదటి పేజీ తరువాయి)

సాగాయని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పైన ఉన్న నీటిని ఎక్కువగా చూపించి, నీటిని తరలించుకుపోవడం సరికాదని అన్నారు.ఈ విషయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు అనవసర రాజకీయ విమర్శలు మానుకోవాలని మంత్రి హితవు పలికారు. ప్రాంతీయ ప్రయోజనాల పరిరక్షణ కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు వచ్చి, ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మరోవైపు, పల్నాడు ప్రాజెక్టు నిర్మాణం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతోందని కోమటిరెడ్డి గుర్తు చేశారు. తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగించే ఈ ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం కూడా ఆలోచించాలని, నిధుల కేటాయింపు, ప్రాజెక్టు నిర్మాణంపై పునరాలోచన చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నాగార్జునసాగర్ పరిధిలో రాష్ట్ర నీటి ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు.

తెలంగాణలో తగ్గనున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు.. 2 నుంచి 4 డిగ్రీల మేర పడిపోయే అవకాశం

మొదటి పేజీ తరువాయి)

రోజుల సూచనలో పేర్కొంది. దీంతో ఉష్ణోగ్రతలు మళ్లీ తగ్గుముఖం పట్టనున్నాయి.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సొసైటీ (టీఎస్‌డీపీఎస్) గణాంకాల ప్రకారం.. ఇప్పటికే ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు హైదరాబాద్ నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తగ్గుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈరోజు ఉదయం 8:30 గంటల సమయంలో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ అర్బన్‌లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 15 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్ జిల్లాలోని బేల, గడిగూడ వంటి ప్రాంతాల్లో 15.4 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది.మరోవైపు, మేఘాల ప్రభావంతో గ్రేటర్ హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సైబరాబాద్ పరిధిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 19.9 నుంచి 21.3 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఈ ప్రాంతాల్లో కూడా చలి ప్రభావం స్పష్టంగా కనిపించనుంది.

ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేపట్టాలి





వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలి

అధికారులకు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశం

హుజూర్‌నగర్, నవంబర్ 26 (నేటి వెలుగు):

జిల్లాలోని ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేపట్టి కూలీలకు నిరంతరం పని కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. రాబోయే వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.గురువారం హుజూర్‌నగర్‌లో ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించిన నేపథ్యంలో ఉపాధి హామీ పనుల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి గ్రామంలో పనుల జాబితా సిద్ధం చేసి, రోజువారీగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కూలీలకు రోజుకు కనీసం రూ. 300 ఆదాయం వచ్చేలా పనులు కల్పించాలన్నారు.

అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధి పనులు

వ్యవసాయం, నీటిపారుదల, ఉద్యానవనం, పశుసంవర్ధక, తాగునీరు, మత్స్య, అటవీ శాఖల సమన్వయంతో ఉపాధి హామీ పథకం కింద కన్వర్జెన్స్ పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు

రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలోని ప్రతి ఆవాసానికి, ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామాల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా తాగునీటి అవసరాలపై అంచనాలు రూపొందించినట్లు తెలిపారు.

వెనుకబడిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి

ఉపాధి హామీ పనుల అమలులో వెనుకబడిన గ్రామాలు, మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. గ్రామపంచాయతీలు, మండలాల వారీగా పనుల పురోగతిని సమీక్షించి నివేదికలు అందించాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, ఆర్డీవో శ్రీనివాసులు, ఎంపీడీవో లక్ష్మి, తహసీల్దార్ హరిప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

బాచుపల్లి పారిశుద్ధ్య కార్మికుల మృతిపై జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ ఆగ్రహం





మృతుల కుటుంబాలకు రూ.30 లక్షల చొప్పున పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం, సొంత ఇల్లు కల్పించాలి

బాధ్యులైన ప్రైవేట్ కంపెనీ ప్రతినిధిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా, నవంబర్ 26 (నేటి వెలుగు):

బాచుపల్లిలో సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేస్తూ ప్రాణాలు కోల్పోయిన ముగ్గురు పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.30 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించడంతోపాటు, పీఎం ఆవాస్ యోజన పథకం కింద సొంత ఇళ్లు, ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు కరం సింగ్ కర్మా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం బాచుపల్లి పరిధిలోని దీపక్ హారిక్ రెసిడెన్షియల్ సొసైటీలో సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేస్తుండగా మాన్యువల్ స్కావెంజింగ్ కారణంగా షణ్ముఖరావు అలియాస్ సుమన్ (26), సురేష్ గజింగి (24), పవన్ (20) మృతి చెందిన ఘటనాస్థలాన్ని ఆయన డీసీపీ కోటిరెడ్డి, జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి సందర్శించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషన్ సభ్యుడు కరం సింగ్ కర్మా మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన ప్రస్తుత కాలంలోనూ కార్మికులను ఎలాంటి భద్రతా పరికరాలు, యంత్రాలు లేకుండా సెప్టిక్ ట్యాంకుల్లోకి దింపి పనులు చేయించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. సరైన రిజిస్ట్రేషన్, శిక్షణ లేని ప్రైవేట్ ఏజెన్సీలకు కాంట్రాక్టులు అప్పగించడం వల్లే ఇలాంటి ప్రాణనష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన ప్రైవేట్ కంపెనీ వ్యవస్థాపకుడు, చైర్మన్ రవిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.మృతుల కుటుంబాలకు కంపెనీ తరఫున చెక్కులు, బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ ద్వారా తక్షణ పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీకాకుళం వెళ్లిన మృతుల వారసులకు కూడా పరిహారం అందజేస్తామని అధికారులు కమిషన్‌కు వివరించారు.

కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి

సొసైటీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులతో కమిషన్ సభ్యుడు నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కాంట్రాక్టర్లు కనీస వేతనాలు చెల్లించకపోవడంతోపాటు గత మూడేళ్లుగా బోనస్, యూనిఫామ్, బూట్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, పీఎఫ్, ఈఎస్ఐ నిధుల విషయంలోనూ కార్మికులకు అన్యాయం జరుగుతోందని గుర్తించినట్లు కమిషన్ వెల్లడించింది.బాచుపల్లి పరిధిలోని సుమారు 255 రెసిడెన్షియల్ సొసైటీల అధ్యక్షులు, కార్యదర్శులతో ప్రతి ఆరు నెలలకోసారి సమావేశం నిర్వహించి కార్మికుల కనీస వేతనాలు, హక్కులు, సెప్టిక్ ట్యాంక్ భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ మను చౌదరికి సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే కాంట్రాక్టర్లపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ.. అండగా ఉంటామని భరోసా

అనంతరం స్థానికంగా నివసిస్తున్న మృతుడు సురేష్ గజింగి కుటుంబాన్ని కమిషన్ సభ్యుడు కరం సింగ్ కర్మా పరామర్శించారు. సురేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకెష్ కుమార్, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్, బాచుపల్లి డీసీ షబ్బీర్ అలీ తదితర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను పక్కాగా పూర్తి చేయాలి

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి -- డీఎంహెచ్వో డా. కళ్యాణ్ చక్రవర్తి

రంగారెడ్డి జిల్లా, నేటి వెలుగు:



రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (డిఎంహెచ్వో) కార్యాలయంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల () మెడికల్ ఆఫీసర్లతో వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కళ్యాణ్ చక్రవర్తి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా టీబి ముక్త్ భారత్, నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (), మాతా శిశు సంరక్షణ, ఇమ్యునైజేషన్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సేవలు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ తదితర జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు, పురోగతిని సమీక్షించారు.ప్రతి ఆరోగ్య కార్యక్రమానికి నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో పక్కాగా పూర్తి చేయాలని డిఎంహెచ్వో అధికారులకు సూచించారు. ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ప్రభుత్వ ఆరోగ్య పథకాలు, వైద్య సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహించకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో అడిషనల్ డిఎంహెచ్వో డా. పాపారావు, డిప్యూటీ డిఎంహెచ్వోలు డా. రాకేష్, డా. రాధిక, డా. సత్య రత్న, డా. సత్యవతి, డా. షేబా హయాత్, డా. వినోద్, పి.ఓ. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ డా. సోలోమన్‌తో పాటు జిల్లాలోని అన్ని పి హెచ్ సి ల మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, వివిధ ఆరోగ్య కార్యక్రమాల అధికారులు పాల్గొన్నారు.



చీర్యాల శ్రీ చైతన్య పాఠశాలలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

- **నేటి ఆవిష్కరణలే రేపటి శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి పునాది**
- **నవంబర్ 28, 29 తేదీల్లో 54వ బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ -- మనాక్**

కీసర, నవంబర్ 26 (నేటి వెలుగు):

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం, సృజనాత్మకత, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను కీసర మండలం చీర్యాలలోని శ్రీ చైతన్య పాఠశాలలో నిర్వహించనున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు నవంబర్ 28, 29 తేదీల్లో రెండు రోజులపాటు ఈ ప్రదర్శన జరగనుంది.ఈ ప్రదర్శనలో 2025--26 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్--మనాక్ కార్యక్రమానికి ఎంపికైన పాఠశాలల విద్యార్థులు రూపొందించిన వినూత్న శాస్త్రీయ నమూనాలు, ప్రోటోటైప్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అదేవిధంగా 54వ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా విద్యార్థులు రూపొందించిన శాస్త్రీయ నమూనాలు, పరిశోధనా ప్రాజెక్టులు, నూతన ఆవిష్కరణలను ప్రదర్శించనున్నారు.

నాలుగు విభాగాల్లో ప్రదర్శనలు

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా ఇన్‌స్పైర్--మనాక్, 54వ బాల వైజ్ఞానిక ప్రదర్శన, పీఎం శ్రీ పాఠశాలల వైజ్ఞానిక ప్రదర్శన, ఉపాధ్యాయుల బోధనా అభ్యసన సామగ్రి ప్రదర్శనలను ఏర్పాటు చేయనున్నారు. ఉపాధ్యాయులు రూపొందించిన వినూత్న బోధనా పరికరాలు, తరగతి గది బోధనా పద్ధతులు కూడా ఈ ప్రదర్శనలో ప్రత్యేకంగా చోటు చేసుకోనున్నాయి.విద్యార్థులు పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా ప్రయోగాత్మకంగా నేర్చుకోవడం, కొత్త ఆలోచనలతో ఆవిష్కరణలు చేయడం, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా మలచడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు.

పాఠశాలల భాగస్వామ్యానికి పిలుపు

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని విద్యాశాఖ సూచించింది. ఎంపికైన విద్యార్థి బృందాలు, వారికి మార్గదర్శకత్వం వహించే గైడ్ టీచర్లు నవంబర్ 28వ తేదీ ఉదయం నిర్ణీత సమయానికి ప్రదర్శన వేదిక వద్ద హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, భవిష్యత్తు శాస్త్రవేత్తలను ప్రోత్సహించేందుకు ఈ జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో దోహదపడనుంది.

నేరస్తులకు శిక్షలు పడేలా సమర్థవంతమైన కృషి

- **102 కేసుల్లో నిందితులకు శిక్షలు.. 6 కేసుల్లో జీవిత ఖైదు**
- **మరో 8 కేసుల్లో 10 నుంచి 31 ఏళ్ల వరకు జైలు శిక్షలు**
- **ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ఎస్పీ ప్రశంసా పత్రాలు, మెమెంటోలులి**

నల్లగొండ, నవంబర్ 26 (నేటి వెలుగు):



నేరస్తులకు న్యాయస్థానాల్లో శిక్షలు పడేలా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ, శిక్షల శాతం పెంపులో విశేష ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు (సీడీఓలు), పబ్లిక్ ప్రాసిక్యూటర్లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ అభినందించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఇప్పటివరకు నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ కృషితో మొత్తం 102 కేసుల్లో నిందితులకు న్యాయస్థానాల ద్వారా శిక్షలు విధించబడినట్లు తెలిపారు. వీటిలో 6 కేసుల్లో జీవిత ఖైదు, మరో 8 కేసుల్లో 10 నుంచి 31 సంవత్సరాల వరకు జైలు శిక్షలు పడినట్లు వెల్లడించారు.

పటిష్టమైన సాక్ష్యాధారాలతోనే నేరస్తులకు శిక్షలు

కేసుల దర్యాప్తు ప్రారంభం నుంచి న్యాయస్థానాల్లో విచారణ పూర్తయ్యే వరకు పోలీసు అధికారులు, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు.

ఉత్తమ ప్రతిభకు ప్రశంసలు.. మరింత బాధ్యతగా పనిచేయాలి

శిక్షల శాతం పెంపులో విశేష కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, ఎస్బీ సీఐ నాగరాజు, డీసీఆర్‌బీ సీఐ శ్రీనునాయక్, సీఐలు క్రాంతికుమార్, రంజిత్ రెడ్డి, ఎస్ఐలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు అఖిల, శోభారాణి, రంజిత్ కుమార్, కోర్టు డ్యూటీ అధికారులు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రోత్సాహం

33 మంది పదో తరగతి మండల టాపర్లకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున చెక్కుల పంపిణీ

మిషన్ టెన్త్ క్లాస్ -- చదువుకో తెలంగాణ కార్యక్రమం అభినందనీయం: అడిషనల్ కలెక్టర్ జె. శ్రీనివాస్

నల్లగొండ, నవంబర్ 26 (నేటి వెలుగు):



విద్యార్థుల్లో దాగి ఉన్న విద్యా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని జిల్లా అడిషనల్ కలెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందడంతో పాటు భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మిషన్ టెన్త్ క్లాస్ -- చదువుకో తెలంగాణ 2025--26' కార్యక్రమంలో భాగంగా నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 33 మంది పదో తరగతి మండల టాపర్లకు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున మొత్తం రూ. 3.30 లక్షల ప్రోత్సాహక చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల కష్టానికి తగిన గుర్తింపు లభించినప్పుడు మరింత పట్టుదలతో చదువులో రాణిస్తారని అన్నారు. విద్యారంగ అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ఇటువంటి సేవా కార్యక్రమాలను శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ భవిష్యత్తులోనూ కొనసాగించాలని ఆకాంక్షించారు.

2026--27 విద్యా సంవత్సరానికి పోస్టర్ ఆవిష్కరణ

అనంతరం 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన 'మిషన్ టెన్త్ క్లాస్ -- చదువుకో తెలంగాణ' కార్యక్రమ పోస్టర్‌ను అడిషనల్ కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి సుశిందర్ రావు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సీనియర్ డీజీఎం పి. నరేందర్, డీఎం పి. రాజిరెడ్డి, బ్రాంచ్ మేనేజర్ ఎన్. భాస్కర్ సంయుక్తంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుశిందర్ రావు, వివిధ మండలాల ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సీనియర్ డీజీఎం పి. నరేందర్, డీఎం పి. రాజిరెడ్డి, బ్రాంచ్ మేనేజర్ ఎన్. భాస్కర్, బీడీఎం వి. వెంకటేశ్వర్లు, నర్సింహ, కవిత, రవి, స్వప్న, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. సవీన్ కుమార్ గౌడ్

రాజ్యాంగ హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

రాజ్యాంగ విలువలకు అనుగుణంగా ప్రతి పౌరుడు జీవించాలి

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 26 (నేటి వెలుగు):



77వ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శాసనసభ ప్రాంగణంలోని కమిటీ హాల్‌లో తెలంగాణ శాసన మండలి, శాసనసభ ఉద్యోగులతో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసన మండలి కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి ఆర్. తిరుపతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ 77వ భారత రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచే గొప్ప రాజ్యాంగం భారతదేశానికి ఉందని పేర్కొన్నారు. మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాయకత్వంలో ఎంతో విశిష్టమైన రాజ్యాంగాన్ని రూపొందించుకున్నామని గుర్తుచేశారు. ఒక్క రక్తపు చుక్క కూడా చిందించకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వాలను మార్చగలిగే గొప్ప శక్తిని భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిందని అన్నారు. ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, రాజ్యాంగ విలువలకు అనుగుణంగా జీవించాలని సూచించారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, వాటిని దుర్వినియోగం చేసే విధంగా ఏ పౌరుడూ వ్యవహరించకూడదని గుత్తా సుఖేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.

జలమండలిలో ఘనంగా 'సంవిధాన్ దివస్' వేడుకలు

రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

అధికారులతో, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 26 (నేటి వెలుగు):



భారత రాజ్యాంగ దినోత్సవం (సంవిధాన్ దివస్) సందర్భంగా గురువారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పాల్గొని రాజ్యాంగ ప్రవేశికను చదివారు. అనంతరం రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉంటామని, రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేస్తామని అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను గౌరవించడంతోపాటు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ మౌలిక విలువలను ఆచరణలో కొనసాగించడమే రాజ్యాంగానికి ఇచ్చే నిజమైన గౌరవమని పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచిన భారతదేశానికి అత్యున్నత రాజ్యాంగాన్ని అందించడంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందించిన విశిష్ట సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డైరెక్టర్ (పర్సనల్) మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, డైరెక్టర్ (ఆపరేషన్స్) కిరణ్ కుమార్, డైరెక్టర్ (ఫైనాన్స్) శ్రీనివాస్, సీజీఎంలు, జీఎంలు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిరోజూ పౌష్టిక అల్పాహారం, పాలు పంపిణీ

తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఆరుట్లలో విద్యార్థుల్లో ఆనందోత్సాహం

ఆరుట్ల, నవంబర్ 26 (నేటి వెలుగు):



తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఆరుట్లలో విద్యార్థుల ఆరోగ్యం, పోషణ, విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజూ ఉదయం పౌష్టిక అల్పాహారం, పాలు పంపిణీ చేయడం అభినందనీయంగా నిలుస్తోంది. హరే కృష్ణ హరే రామ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిరోజూ వివిధ రకాల రుచికరమైన అల్పాహారాన్ని అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోజుకో రకమైన ఇడ్లీలు, దోశలు, బోండాలు తదితర అల్పాహార పదార్థాలతో పాటు పాలను కూడా పంపిణీ చేస్తున్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు చదువుపై ఏకాగ్రత పెంపొందేందుకు దోహదపడుతుందని పాఠశాల వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రతిరోజూ ఉదయం రుచికరమైన అల్పాహారం, పాలు అందుతుండటంతో విద్యార్థులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న హరే కృష్ణ హరే రామ సంస్థకు పాఠశాల హెడ్ ఆఫ్ ది స్కూల్ సిద్ధగోని గిరిధర్ గౌడ్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఆరుట్ల గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే విద్యార్థుల సంక్షేమం, పోషకాహారానికి ప్రాధాన్యతనిస్తూ ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

హైకోర్టు జడ్జి కూనూరు లక్ష్మణ్ గౌడ్ తండ్రి గోపాల్ గౌడ్ మృతి

పట్ల బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ సంతాపం

నల్గొండ నవంబర్ 26 (నేటి వెలుగు)





నల్గొండ జిల్లా రామన్నపేట మండలం భోగారం మాజీ గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, ప్రస్తుత హైకోర్టు జడ్జి కూనూరు లక్ష్మణ్ గౌడ్ గారి తండ్రి శ్రీ కూనూరు గోపాల్ గౌడ్ గారు పరమపదించడంతో బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈరోజు భోగారం గ్రామానికి వెళ్లి గోపాల్ గౌడ్ గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జడ్జి కూనూరు లక్ష్మణ్ గౌడ్ గారిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గోపాల్ గౌడ్ గారి మరణం వారి కుటుంబానికి తీరని లోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని జాజుల లింగం గౌడ్ ఆకాంక్షించారు. బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ బొల్లపల్లి స్వామి గౌడ్ ఉన్నారు

నల్గొండ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఉత్తమంగా తీర్చిదిద్దడమే లక్ష్యం





గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, సబ్‌స్టేషన్ల ఏర్పాటు.. అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.12.30 కోట్ల నిధులు మంజూరు

అధికారులతో సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్గొండ, నవంబర్ 26 (నేటి వెలుగు):

రానున్న ఏడాదిన్నర కాలంలో నల్గొండ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గురువారం నల్లగొండ జిల్లా కనగల్ ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, తాగునీటి సమస్యలు, సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రహదారుల నిర్మాణంపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

రూ.3 వేల కోట్లతో రహదారుల అభివృద్ధి

నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు రూ.3 వేల కోట్లతో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారుల పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. వచ్చే నెలలో వీబీ-జీ రామ్-జీ పథకం కింద అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడతామని వెల్లడించారు. అవసరమైతే ప్రత్యేక నిధులు తీసుకొచ్చి పనులను పూర్తి చేస్తామన్నారు.

వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా రూ. 12.30 కోట్లు

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రానున్న వేసవిలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా కనగల్ మండలానికి రూ. 12.30 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. రానున్న మూడు రోజుల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజినీర్, గ్రామ సర్పంచులు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి అత్యవసర తాగునీటి పనులను గుర్తించి అంచనాలు రూపొందించి సమర్పించాలని ఆదేశించారు.

అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

పేదలకు రూ.5 లక్షల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తున్నామని మంత్రి తెలిపారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్లను నిర్మించుకోని లబ్ధిదారుల వివరాలను పరిశీలించి, అర్హత కలిగిన పేదలు, గుడిసెల్లో నివసించే వారికి ఆ ఇళ్లను కేటాయించాలని అధికారులను ఆదేశించారు.

ధర్వేశిపురం ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ధర్వేశిపురంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయాన్ని పర్యాటక శాఖ నిధులతోపాటు ఇతర నిధులతో అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. భక్తుల సౌకర్యార్థం హరిత హోటల్, విశ్రాంతి గృహం, వసతి సదుపాయాలు కల్పిస్తామన్నారు. కనగల్, తిప్పర్తి, నల్లగొండ మండలాల్లో మహిళా సంఘాల ద్వారా గోదాంల నిర్వహణలో భాగంగా వాటి నిర్మాణానికి రూ.30 కోట్లతో టెండర్లు పిలిచినట్లు తెలిపారు. రూ.20 కోట్లతో ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. కనగల్ శివారులో ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి పక్కనే మరో నూతన బ్రిడ్జి నిర్మించనున్నట్లు పేర్కొంటూ, సంబంధిత పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

అర్హులైన కుటుంబాలకు బీమా నమోదు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో అర్హులైన అన్ని కుటుంబాలను నమోదు చేయాలని గ్రామ సర్పంచులను మంత్రి ఆదేశించారు.

అంబేద్కర్‌కు నివాళులు

అంతకుముందు రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని కనగల్ ఎంపీడీవో కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, డీపీఓ తరుణ్ చక్రవర్తి, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

భావితరాలకు రాజ్యాంగ స్ఫూర్తిని అందించడమే లక్ష్యం

నల్లగొండ మైత్రి అకాడమీలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

నల్లగొండ, నవంబర్ 26 (నేటి వెలుగు):

విద్యార్థులకు భారత రాజ్యాంగ విశిష్టత, ప్రజాస్వామ్య విలువలు, పౌరుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో నల్లగొండలోని మైత్రి అకాడమీలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జాతీయ గీతాలాపన అనంతరం విద్యార్థులతో రాజ్యాంగ స్ఫూర్తిపై సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ ఆదర్శాలను రోజువారీ జీవితంలో ఆచరిస్తామని విద్యార్థులు ప్రతినబూనారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, రాజ్యాంగ విలువలను భావితరాలకు అందించడంలో విద్యాసంస్థల పాత్ర కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ హక్కులను తెలుసుకోవడంతోపాటు ఇతరుల హక్కులను గౌరవించాలని, బాధ్యతగల పౌరులుగా ఎదగాలని సూచించారు. కులం, మతం, భాష, ప్రాంతం పేరుతో వివక్ష చూపకుండా ప్రతి వ్యక్తినీ సమాన గౌరవంతో చూడాలన్నారు. రాజ్యాంగ ప్రాముఖ్యత, ప్రాథమిక హక్కులు, పౌర బాధ్యతలపై విద్యార్థులు తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఆస్తుల సంరక్షణ, శాస్త్రీయ దృక్పథం, బాధ్యతాయుతమైన సామాజిక మాధ్యమాల వినియోగంపై అవగాహన కల్పించారు. మైత్రి అకాడమీ చైర్మన్ పాముల అశోక్ ముదిరాజ్ మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతోపాటు సామాజిక స్పృహ, ప్రజాస్వామ్య అవగాహన, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి విద్యార్థికి, వారి ద్వారా ప్రతి కుటుంబానికి చేరవేయడమే కార్యక్రమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి, మెరుగు మధు, బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టోకోలు



దీపేందర్, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొమ్మకాల గిరిబాబు, ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు సోమశేఖర్, లింగం, మైత్రి అకాడమీ చైర్మన్ పాముల అశోక్ ముదిరాజ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతుల త్యాగాలు గుర్తించరా!

నల్లగొండ నవంబర్ 26 (నేటి వెలుగు -- :

ఏఎంఆర్‌పీ () ఉదయ సముద్రం ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ విలువైన భూములను త్యాగం చేసిన రైతుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ మండలంలోని చందనపల్లి, రెడ్డి కాలనీ, దండంపల్లి, పానగల్ గ్రామాలకు చెందిన రైతులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఏఎంఆర్‌పీ ఉదయ సముద్రం ప్రాజెక్టు కోసం ఆయా గ్రామాల రైతులు తమ భూములను త్యాగం చేశారని, ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా కొన్ని బావులను కోల్పోయినా ఇప్పటివరకు నష్టపరిహారం అందని రైతులు ఉన్నారని తెలిపారు. ఇన్నేళ్లుగా కొనసాగుతున్న విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ శాఖ అధికారులే విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. అయితే వారం రోజుల క్రితం ఎలాంటి ముందస్తు చర్యలు లేకుండా అధికారులు మోటార్ విద్యుత్ కనెక్షన్లను తొలగించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీరు అందక పంట పొలాలు, పామాయిల్ తోటలు, ఉద్యానవన పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. పక్క నియోజకవర్గాల్లో ఇలాంటి పరిస్థితి లేనప్పుడు నల్లగొండ నియోజకవర్గ పరిధిలోని నాలుగు గ్రామాల రైతుల కనెక్షన్లనే ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చి త్యాగాలు చేసిన రైతులకు తిరిగి ఇబ్బందులు కలిగించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. రైతుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకొని తొలగించిన విద్యుత్ కనెక్షన్లను వెంటనే పునరుద్ధరించి, రైతులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎనుగుల రాకేష్ రెడ్డి, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నల్లగొండ మండల పార్టీ అధ్యక్షుడు దేప వెంకట్ రెడ్డి,



నగర పార్టీ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్, కార్యదర్శి బడుగుల శంకర్, దండంపల్లి సర్పంచ్ మల్లెబోయిన బుచ్చిరాజు, రెడ్డి కాలనీ సర్పంచ్ రేకల ఆంజనేయులు, మాజీ సర్పంచులు సురిగి రమేష్, ఎలుక శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పెద్ది వెంకటయ్య, అల్లి వెంకన్న, బొడ్డుపల్లి శ్రవణ్, శ్రీకాంత్, అంజిరెడ్డి, యాదగిరి రెడ్డి, మాధవరెడ్డి తదితరులు, ఆయా గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**